కథ

# ప్రేమ ఎంత మధురం

చదువుకుందామని పుస్తకం తెరిచిన మానసకి అందులో అక్షరాలేమీ కనిపించలేదు. చిరునవ్వు చిందిస్తూ తనవంకే నిర్నిమేషంగా చూస్తున్న అతని రూపమే కనిపిస్తోంది.

అప్పుడప్పుడే రేకులు విచ్చుకుంటున్న మొగ్గలా ఉన్న మానస హృదయంలో ఏవో తియ్యని తలపులు కొత్తగా రెక్కలొచ్చెనా అన్నట్లుగా మనసంతా మధురోహలతో నిండిపోగా చెక్కిట చెయ్యి చేర్చి, ఆలోచనలలో మునిగిపోయింది.

పుస్తకం ముందు పెట్టుకొని ఎటో ఆలోచిస్తున్న కూతుర్ని చూసి-!''ఏమిటమ్మా పరధ్యానం? ఏం ఆలోచిస్తున్నావు?'' అనడిగాడు జయరాం ఆదరంగా కూతురి ముంగురులు సవరిస్తూ.

తండ్రి మాటలతో ఉలిక్కిపడిన మానస ఒక్కక్షణం అర్థం కానట్లుగా చూసి అంతలోనే సర్దుకుంటూ ''ఏం లేదు నాన్నా..ఈ పోటీకి తట్టుకొని నేను నెగ్గుకు రాగలనా అని ఆలోచిస్తున్నానంతే'' అంది మానస తడబడుతూ.


''ఎందుకమ్మా..ప్రతిదానికీ అంత కంగారు పడతావు? నీకు సబ్జెక్ట్ మీద మంచి గ్రిప్ ఉంది. ఆపైన ఎం.సెట్ కోచింగ్ తీసుకుంటున్నావు. నీకు డెఫినెట్‌గా సీటు వస్తుందని నాకు నమ్మకం. అనవసరంగా టెన్షన్ పడకు. తగినంత కృషితోపాటు పాజిటివ్ థింకింగ్ ఉంటే సాధించలేనిది ఏదీ లేదు తెలుసా?'' అన్నాడు జయరాం.

''సరే నాన్నా!'' అంటూ పుస్తకం వైపు దృష్టి మరల్చింది మానస.

తండ్రి అక్కడి నుండి వెళ్లిపోయాక కళ్లు గట్టిగా మూసుకొని- పరీక్షలు చూస్తే పట్టుమని రెండు నెలలయినా లేవు. ఇలా అయితే నేను రాంక్ సాధించగలనా? అనుకుంటూ ఒక్కసారిగా తల విదిల్చింది.

మరునాడు కాలేజీకి వెళుతూ ఉంటే..ఎప్పటిలాగే బస్టాప్ దగ్గర మానసకు ఎదురయ్యాడతను. దృష్టి మరల్చుకుంది మానస.

మరో రెండు, మూడు రోజులు అదే విధంగా గడిచిపోయాయి. ఓరోజు అతను మానస క్లాసు అయ్యాక బైటికి వస్తూండగా దగ్గరకు వచ్చి పక్కనే




నడుస్తూ..''నా పేరు రహ్మాన్. నేను జె.యన్. టి.యులో బి.టెక్ చదువుతున్నాను'' అని అతను చెప్తున్నది వినిపించుకోకుండా ముందుకు నడుస్తున్న మానసతో.

''ప్లీజ్ మానసా...జస్టె మినిట్.. నేను మీతో మాట్లాడాలి. ఒక్క అయిదు నిముషాలు ఆగండి ప్లీజ్'' అన్నాడు.

''సారీ, నాకిలాంటివి ఇష్టం ఉండవు. అయినా మీ వివరాలతో నాకేం పని? నా మానాన నన్ను పోనివ్వండి. నా బస్సు మిస్సవుతుంది'' అంది మానస.

''పోతే పోనివ్వండి. నా బైక్ మీద దిగబెడతాను మిమ్మల్ని. కొంచెం చెప్పేది వినండి'' అన్నాడు.

''ఏమిటి వినేది..అసలు మీకూ నాకూ మధ్య మాటలేమిటి..ఎందుకు నన్నిలా డిస్టర్బ్ చేస్తున్నారు?''

''అదే..ఆ మాటే నేను మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను. ఎందుకు నన్నిలా డిస్టర్బ్ చేస్తున్నారు? మిమ్మల్ని చూసిన దగ్గరనుండీ చదువుమీద కాన్సెన్‌ట్రేట్ చెయ్యలేకపోతున్నాను. తిన బుద్ధి కాదు. నిద్ర రాదు. మీరు ఒక్క రోజు కనబడకపోతే నాకు పిచ్చి ఎక్కిన

ట్లుగా ఉంటుంది'' అన్నాడు.

''అయితే నన్నేం చెయ్యమంటారు? ఎవరినైనా సైకియాట్రిస్ట్‌ను సంప్రదించండి''

''మీరలా అంటే నేనేం చెప్పగలను? జీవితమంతా మీ సమక్షంలో ఉండిపోవాలని ఉంది మానసా! ఐ లవ్ యూ..ఐ వాంట్ టు మేరీ యూ..ప్లీజ్ అండర్‌స్టాండ్ మీ!'' అన్నాడు దీనంగా చూస్తూ.

దాంతో పూర్తిగా కరిగిపోయిన మానస ''నా పరీక్షలు చూస్తే పట్టుమని రెండు నెలలు కూడా లేవు. నన్ను డాక్టర్ని చేయడం మా నాన్నగారి జీవితాశయం. మీరిలా నా వెంట పడడం న్యాయమేనా?'' అంది. ఆ ప్రశ్నలోనే ఆమె అంగీకారం కూడా కనబడడంతో



రహ్మాన్ కళ్లల్లోకి వెలుగు వచ్చేసింది.

''థాంక్యూ..థాంక్యూ మానసా! నా ప్రేమను అంగీకరించావు. అంతే చాలు నాకు. ఇకనుండీ నిన్ను దూరం నుండే చూసి వెళ్లిపోతాను. నీకె లాంటి ఇబ్బంది కలిగించను'' అంటూ సంతోషంతో అక్కడినుండి వడివడిగా వెళ్లిపోయాడు రహ్మాన్.

అతని అభిప్రాయం నిజం కాదని గట్టిగా చెప్పలేకపోయింది మానస. ఎందుకంటే అప్పటికే ఆమెలో అతను వేసిన ప్రేమబీజం మొలకెత్తింది కనుక.

★ ★ ★

కోరుకున్నట్లుగానే మానస ఎం.సెట్‌లో మంచి రాంక్ సంపాదించింది. ఉన్న ఊళ్లోనే సీటు రావడంతో అంతా హేపీగా ఫీల్ అయ్యారు. కూతురికి బహుమతిగా కైనెటిక్ హోండాను కొనిపెట్టాడు జయరాం.

కాలేజీనుండి ఇంటికి

## దూరం..దూరం

**తారల వ్యక్తిగత వ్యవహారాలు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. అందాలతార సమీరారెడ్డి ఇప్పుడు తన ఫిల్మ్ కెరీర్ పైనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తున్నట్టుంది. అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో చాలా బిజీగా ఉన్న ఈ భామ కొత్త సిన్మా అవకాశాల కోసం నిర్మాత, దర్శకులతో సంభాషణలు చేస్తూ చాలా బిజీగా ఉంది. అందుకేనేమో సంజయ్‌గుప్తాతో మాట్లాడడానికి టైం కుదరడం లేనట్టుంది. అంతేనా సమీరా ఇంకేమైనా ఉందా?**

వెళ్తున్న మానసను ఫాలో అవుతున్న రహ్మాన్ రద్దీ ఎక్కువగా లేని చోట..తన బైక్ మానస పక్కకు తీసుకెళ్లి..''కంగ్రాట్స్ మానసా! అనుకున్నది సాధించావు..మరి ఈ శుభ సందర్భాన్ని సెలిబ్రేట్ చేసుకోవద్దా మనం. అలా ఐస్‌క్రీం పార్లర్‌కు వెళ్దాం రా!'' అన్నాడు.

కాదనలేకపోయింది మానస. ఇద్దరూ కలిసి ఐస్‌క్రీం పార్లర్‌లోకి అడుగుపెట్టారు. కార్నర్ టేబిల్ చూసుకుని కూర్చున్నారు ఇద్దరూ.

''నీకోసం రెండు గంటలనుండీ మీ కాలేజీ గేటు దగ్గర పడిగాపులు కాచాను. ఇలా నువ్వు మౌనవ్రతం పాటించడానికా? ఏదైనా మాట్లాడు మానసా!'' అన్నాడు రహ్మాన్.

''ఏం మాట్లాడాలి? అవునూ..నా పేరు ఎలా తెలుసుకున్నావు నువ్వు?'' అని అడిగింది మానస.

''మనసుంటే మార్గముండదా..పేరు తెలుసుకోవడం పెద్ద పనా?'' అన్నాడు రహ్మాన్ నవ్వుతూ.

''అయితే నా గురించి ఇంకా నీకు ఏమేమి తెలుసో చెప్పు వింటాను'' అంది మానస.

''నీకు అన్నిటికంటే వైట్ కలర్ అంటే ఎక్కువ ఇష్టం. అందుకే ఎక్కువగా వైట్ కలర్ డ్రస్సులే వేస్తావు రాజహంసలా. ఆ పైన వెనీలా ఐస్‌క్రీం చాలా ఇష్టంగా తింటావు. వారానికోసారైనా మీ ఫాదర్‌తో, మీ చెల్లాయితో కలిసి వస్తూ ఉంటావు. ఇక్కడికి మంచి మ్యూజిక్..హ్యూమరస్‌గా ఉన్న సినిమాలిష్టపడతావు. బాగా నచ్చితే చూసిన సినిమానే మళ్లీ చూస్తావు. చాలా ఇంకేమైనా కావాలా?'' అన్నాడు రహ్మాన్ అల్లరిగా నవ్వుతూ.

''చాలు..చాలు..ఇన్ని వివరాలు ఎక్కడ సంపాదించావు నువ్వు?'' అంది మానస నవ్వుతూ.

''నువ్వే చెప్పావు కదా..రెండు నెలల్లో నా పరీక్షలున్నాయి. నన్ను డిస్టర్బ్ చేయకని..అందుకని అనుక్షణం నీకు కనిపించకుండా నిన్ను ఫాలో అయి నీ ఇష్టాఇష్టాలు తెలుసుకున్నాను'' అన్నాడు రహ్మాన్.

''బాగుంది!'' అంది మానస.

''ఏమిటి, నా డిస్కవరీయా?'' అనడిగాడు రహ్మాన్ నవ్వుతూ.

''కాదు. ఐస్‌క్రీం!'' అంది మానస.

''అవునవును..జీవితం కరిగిపోతున్న ఐస్‌క్రీం లాంటిదట. అందుకే కరిగిపోకుండా దాన్ని తినేయాలట'' అంటూన్న రహ్మాన్ మాటలను మధ్యలోనే తుంచేస్తూ..

''ఇప్పటికిది చాలట. ఆ పైన ఆలోచించడం ఒంటికి మంచిది కాదట!'' అంది మానస లేస్తూ.

''అప్పుడేనా..ఎందుకంత తొందర?'' అన్నాడు రహ్మాన్.

''సారీ..మా నాన్నగారు చూస్తూంటారు నా కోసం'' అంది మానస బైటకు నడుస్తూ..అనుసరించక తప్పలేదు రహ్మాన్‌కు.

వాళ్లిద్దరూ బైటకు వచ్చేసరికి జయరాం ఉన్నాడక్కడ. కూతుర్ని సర్‌ప్రైజ్ చేయాలని ఐస్‌క్రీం ఫ్యామిలీ ప్యాక్ తీసుకువెళ్లేందుకు వచ్చాడక్కడికి.

కూతురితోపాటు వస్తున్న రహ్మాన్ని చూసి ఆశ్చర్య పోయాడు. తండ్రినక్కడ చూసి బిత్తరపోయింది మానస. బిక్క చచ్చిపోయాడు రహ్మాన్.

ఇద్దరి వైపూ ప్రశ్నార్థకంగా చూశాడు జయరాం. ఇద్దరూ తల వంచుకున్నారు. పరిస్థితి అర్థమైంది జయరాంకి.

''ఇంటికి వెళ్దాం పదండి'' అంటూ వెనక్కు తిరిగాడు జయరాం ఐస్‌క్రీం కొనకుం డానే..ఇద్దరూ మౌనంగా అనుసరించారు.

ఇంటికి వచ్చాక..మానస రహ్మాన్ తలవంచు కొని నించున్నారు. జయరాం ఇద్దరి వైపూ మౌనంగా చూస్తూ ఉండిపోయాడు కొద్దిసేపు. జయరాం చిన్న కూతురు తేజస్విని...జరుగుతు న్నదేమిటో అర్థంకాక ఒక్కసారి తొంగి చూసి వెళ్లి పోయింది జయరాం సైగ చేయడంతో.

## పరిమళభరితం

**కొంతమంది తారలు పాత తారల అభి రుచుల్ని, అందాన్ని పుణికిపుచ్చుకున్నారేమో అన్పిస్తుంది. తాజాగా మీరాజాస్మిన్ సంగతినే అందరూ ప్రస్తావిస్తున్నారు. అవకాశాల విష యంలో ఆమె అందరికంటే భిన్నమైన వైఖరిని అవలంభిస్తున్నట్టుంది. మీరాజాస్మిన్ అలనాటి నటి సౌందర్య తరహాలో నటిస్తున్నట్టు ఉందం టున్నారంతా. రోజురోజుకీ పోటీ పెరిగిపో తున్న తరుణంలో ఎలాంటి జిమ్మిక్కులు చేయ కుండా మంచి నటనా కౌశలంతో ఆమె అందర్నీ ఆకట్టుకుంటోంది. ఇప్పుడు తెలుగు చిత్ర సీమకి మంచి నటి లభించిందని మీరా జాస్మిన్‌ని ఉద్దేశించి అంటున్నారంతా. బెస్టాఫ్ లక్ మీరా!**

''ఇప్పుడు చెప్పండి..ఏమిటి సంగతి?'' అన్నాడు జయరాం.

ఇద్దరూ మాట్లాడకుండా తలవంచు కున్నారు.

''తప్పు చేసిన వాళ్లే తల వంచుకుం టారు. మీరేం తప్పు చేయలేదని నా నమ్మకం. సరే నేనడిగేదానికి జవాబు చెప్పండి. ఇంతకీ నీ పేరేమిటీ?'' అనడి గాడు.

''రెహ్..రెహ్మాన్ అండీ!'' అన్నాడు తడబడుతూ.

''ఏం చదువుతున్నావు?''

''బి.టెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నా నండీ జెయన్‌టియూ లో''



''ఆహా అలాగా! మా అమ్మాయి క్లాసుమేట్‌వి కాదన్నమాట. ఏమ్మా, ఇతనెలా పరిచయము య్యాడు నీకు?'' అనడిగాడు జయరాం కూతురి వంకే సూటిగా చూస్తూ.

''నాన్నా..మరేమో..'' అని తటపటాయి స్తున్న మానస వంక ఆరాటంగా చూస్తూ.

''తన్నేమీ అనకండి సార్..తనకేం తెలియదు, నాకు మానసంటే చాలాఇష్టం. తొలిచూపులోనే తనని ప్రేమించాను. నేను..నేనే వెంటపడి..'' ఆ పైన మాట పూర్తి చేయలేకపోయాడు రహ్మాన్.

''ఏమ్మా అతను చెప్పింది నిజమేనా? నువ్వూ అతన్ని ప్రేమిస్తున్నావా? నీ వయసెంత. ఈరోజు ప్రొఫెషనల్ కాలేజీలో అడుగుపెట్టావో లేదో అప్పుడే ప్రేమలు కావాల్సి వచ్చాయా నీకు?'' అన్నాడు జయరాం.

ఆ మాటలు వినడంతోనే వచ్చేసాయి కన్నీళ్లు మానసకు. అది చూసి చలించిపోతూ ''సార్, తన్నేమీ అనకండి. తప్పేమైనా ఉంటే నా వలనే జరి గింది. కానీ మీరు మా పెళ్లికి అంగీకరించి ఆశీర్వ దిస్తారనుకున్నాను. ఎందుకంటే మీదీ ప్రేమ వివా హమే కనుక'' అన్నాడు రహ్మాన్ ధైర్యాన్ని కూడగ ట్టుకుంటూ.

''ఓహో..మా గూర్చి చాలా సమాచారమే సేకరించావే..ఐనా చెప్తున్నాను విను. అవును మాది ప్రేమ వివాహమే. అది మిగిల్చిన చేదు అనుభవం తోనే చెప్తున్నాను. మీ పెళ్లి జరగదని'' అన్నాడు జయరాం.

''ఎందుకని సార్..మీరే అలా అంటే ఎలా సార్?'' అన్నాడు దిగులుగా.

''ఎందుకంటే..పెద్దల ఆమోదం లేని ఏ పెళ్లీ విజయవంతం కాదు కనుక..నేను పడిన కష్టాలే నా పిల్లలు కూడా పడకూడదన్న స్వార్థంతో వద్దంటు న్నాను. మీ మతం వేరు. మా మతం వేరు. ఎంత కాదనుకున్నా ఈ దేశంలో కులమతాల వ్యత్యాసం అలాగే ఉంది. ఈ పెళ్లికి నేను ఒప్పుకున్నా మీ తల్లి దండ్రులు అంగీకరించరు. పెద్దల అండదండలు లేని కాపురాలు ఎలా ఉంటాయో నాకూ నా పిల్ల లకూ బాగా తెలుసు. అందుకే మీ పెళ్లి జరగదం టున్నాను.. మీ భాషలో చెప్పాలంటే..ప్రేమించడా నికి ఇద్దరు మనుషులుంటే సరిపోతుంది. కానీ పెళ్లి చేసుకునేందుకు రెండు కుటుంబాలు కావాలీ అంటాడు నాగార్జున ఏదో సినిమాలో'' అని ఆగాడు జయరాం.

''అదే నాగార్జున తల్లి ఏడ్చిందనో, తండ్రి బెది రించాడనో..ప్రేమించిన వాళ్లను వదలుకోవద్దని మరో సినిమాలో చెప్పాడు'' అన్నాడు రహ్మాన్ దూకుడుగా.

''గుడ్..చురుకైన వాడివే..అది సినిమా కనుక సందర్భానుసారంగా డైలా గులు వాడతారు. ఎవరికి అనుకూలమై నవి వారు తీసుకుంటారు మనలా..కానీ ఇది జీవితం! పెళ్లితో సినిమాలో శుభం కార్డు పడిపోతే..జీవితంలో పెళ్లితోనే మొదలవుతుంది అసలు కథ.

మాది ప్రేమ పెళ్లి..నా భార్య తల్లిదం డ్రులు బాగా డబ్బున్నవాళ్లు. మాది నిప్పులు కడిగే ఆచారమున్న బ్రాహ్మణ కుటుంబం. మా పెళ్లికి ఎవరూ ఒప్పుకో లేదు. ఇద్దరం చదువుకున్నాం కనుక ఎలా గోలాగ బ్రతక్కపోమని ధైర్యంగా ఒకట య్యాము. మా పెద్దపాప పుట్టినప్పుడు చూసేందుకు మా వాళ్లెవరు ఎవరూ రాలేదు మా ఇంటికి. అన్నీ మాకు మేమే చేసుకోవలసి వచ్చింది. స్నేహితులు ఒకటి రెండురోజులు సాయంగా ఉండగ లరు గానీ సాంతం మాతోనే ఉండలేరు గదా..రెండవ పాప పుట్టినప్పుడు మరీ ఇబ్బందిపడ్డాము. ఇంట్లో చంటిపి ల్లనూ...హాస్పిటల్‌లో బాలింతనూ చూసుకోలేక చాలా అవస్థపడ్డాను. ఎలాగో మేనేజ్ చేసుకున్నాను.

మరో ఆరేళ్లు మా జీవన నౌక ఏ ఒడి దుడుకులూ లేకుండా సాఫీగా సాగిపో

యింది. ఒక్క డబ్బులేదన్న బాధ తప్పితే..మేము సంతోషంగానే గడిపాము. ఇంతలో అనుకోని అవాంతరంలా నా భార్యకు బ్రెస్ట్ కాన్సర్ వచ్చింది. నా తల్లిదండ్రులు మా పెళ్లయ్యాక నేను చచ్చిపోయానని పిండప్రదానం చేసారు. ఇక వారి నుండి సహాయం అందే ప్రశ్నేలేదు. నా భార్య ప్రసవించిన రెండుసార్లూ వాళ్ల పుట్టింటి వాళ్లకి ఇన్‌ఫామ్ చేశాను. అటునుండి ఎటువంటి రెస్పాన్సూ లేదు. కానీ నా భార్యకు కేన్సరు వచ్చాక..అభిమానం చంపుకొని ఆర్థిక సాయం కోరుతూ ఫోన్ చేశాను వాళ్లకి. అసలు నేను చెప్పేదేమిటో కూడా వినిపించుకోకుండా ఫోను కట్ చేసేసే వాళ్లు.

నా భార్య చనిపోయింది. ఈ మాట తలుచుకున్నప్పుడల్లా నా మనసు తల్లడిల్లిపోతుంది. నా భార్య చనిపోయి తొమ్మిది సంవత్సరాలయింది. ఆమె తీపి గుర్తుగా ఈ పిల్లలిద్దర్నీ నా కంటిపాపల్లా చూసుకుంటున్నాను. మరో పెళ్లి చేసుకోవాలనే ఆలోచన కూడా రాలేదు నాకు. నా దగ్గర డబ్బు లేకపోయినా ప్రేమాభిమానాలు నిండుగా ఉన్నాయి. వాటితోనే పెంచాను వీళ్లను. నా పిల్లలెలా పెరిగారో వాళ్ల పిల్లలూ అలాగే ఏ బంధాలూ, అనుబంధాలూ లేకుండా పెరగాలా? వద్దు..అలాంటి జీవితం వద్దే వద్దు. అందుకే చెప్తున్నాను. మీ పెళ్లికి నేను అంగీకరించినా..మీ పెద్దవాళ్లు అనుమతించరు. వాళ్లు అనుమతిస్తే నాకు ఓకేనే!'' అన్నాడు జయరాం.

అంతా విన్న రహ్మాన్ ''ఓకేసార్. నేను వెళ్లి మా పెద్దవాళ్లతో మాట్లాడి రేపు కలుస్తాను. బై మానసా!'' అంటూ వెళ్లిపోయాడు.

అతను వెళ్లాక ''ఏమ్మా నేను అన్నది నిజమే కదా!'' అన్నాడు జయరాం మానస దగ్గరకు వచ్చి తలమీద చెయ్యి వేసి నిమురుతూ.

చటుక్కున ఆ చేయి అందుకుని కళ్లకద్దుకుంటూ..''సెంట్ పర్సెంట్ కరెక్టు నాన్నగారూ!'' అంది మానస చెమరించిన కళ్లతో.

''అమ్మా..నీ సుఖం తప్ప నాకేం కావాలమ్మా..అతన్నీ నిన్నూ వేరు చెయ్యాలన్న ఆలోచనతో చెప్పలేదమ్మా..భవిష్యత్తు మీద భయంతో..మీ బ్రతుకులైనా సుఖంగా ఉండాలన్న ఆరాటంతో అలా చేసానమ్మా'' అన్నాడు జయరాం.

''నాకు తెలుసు నాన్నగారూ..మీరేం చేసినా మా కోసమే చేస్తారనీ నాకు తెలుసు. మీ మనసుకు కష్టం కలిగించే పని నేనేమీ చేయను'' అంది మానస స్థిరంగా.

★ ★ ★

రహ్మాన్ చెప్పిందంతా విన్న అతని తల్లిదండ్రులు మండిపడ్డారు.

''అరే బద్మాష్! దిమాగ్ ఖరాబయిందా? మై నహీ సమఝతా..హైద్రాబాద్ నవాబ్‌ల వంశానికి చెందిన మనమెక్కడ..ఆ సాదా సీదా లడకీ ఎక్కడ..షరమ్ నహీ ఐసీ బాత్ కరనేసే..బేవకూఫ్!'' అంది తల్లి.

''అరే గధే..కాలేజీకి పోయి చదువుకోమని బైకు కొనిస్తే నువ్వు చేస్తున్న పని ఇదా? నా ఇజ్జత్ ఖరాబు చెయ్యడానికి పుట్టావుకదరా..కల్ హమారే ఖాన్‌దాన్ మే ముహ్ కైసా దిఖాయేంగే..రేపు నీ చెల్లికి నిఖా చెయ్యాలంటే ఎలా చెయ్యాలి? ఏం చూసి ఆ పిల్లని నిఖా చేసుకుంటానంటున్నావురా నువ్వు..మన జాతి కాదు మతం కాదు..పోనీ అందమంటావా..అంతకంటే ఖూబ్‌సూరత్ లడకియోం లాఖోం మే మిల్తే హై హమారే ముసల్మాన్‌మే..బేటా ధ్యాన్ రఖో..ఆ పిల్లని మర్చిపో..నా దోస్త్‌కా బేటీ లక్నోలో ఉంది. ఆ పిల్లని నిఖా చేసుకుంటే మస్త్ దహేజ్ వస్తుంది బేటా..పోయిన మన నవాబీ ఖాన్‌దాన్ ఫిర్ అతా హై బేటా!'' అన్నాడు రహ్మాన్ తండ్రి.

''దేఖో బేటా హమారా ఖూన్ పసీనా ఏక్ కర్‌కే తుమ్‌కో పాలా పోసా, బడా కియా, తుమారా ఖుషీ హమారా ఖుషీ అనుకున్నాము. నువ్వు గానీ ఆ పిల్లని నిఖా చేసుకుని తీసుకువస్తే నా లాష్‌ని చూస్తావు బేటా యాద్ రఖో..సమఝా మేరీ బాత్?'' అంది రహ్మాన్ తల్లి కళ్లు తుడుచుకుంటూ.

''మీరిద్దరూ అలా అంటే మై క్యా బోలూం..మానస బినా మై జీ నహీ సక్తా..బోలో మై క్యా కరూం!'' అన్నాడు రహ్మాన్ బాధగా.

''అంత బేఫర్వాగా చెప్తూంటే మై క్యా బోలూం..జావ్ బేటా జావ్. ఇస్ దిన్ తుమ్ మర్‌గయా అని గుండె రాయి చేసుకుంటాం!'' అన్నాడు రహ్మాన్ తండ్రి.

''బేటా ఫిర్ సోచో..దేఖో తుమారా బాప్‌కో..నా బేటా ఐసా మత్ కరో..దేఖో తుమారీ ఛోటీ బహెన్ హసీనాకో..నీకు దహేజ్ తీసుకుని దీని నిఖా ధూమ్ ధూమ్‌గా చెయ్యాలనుకున్నాము. మా ఆశలిలా నాశనం చెయ్యడం బాగుందా?'' అంది రహ్మాన్ తల్లి కూతురి వైపు జాలిగా చూస్తూ.

రివ్వున వచ్చి రహ్మాన్‌ను వాటేసుకుంటూ..''నా భయ్యా, మత్ జావ్...తూ బినా హమ్ కైసా రహేంగే?'' అంది హసీనా ఏడుస్తూ.

దాంతో మాటలు రానట్లుగా అచేతనంగా నిలబడిపోయాడు రహ్మాన్. ఆస్తిపాస్తులన్నీ హరించుకుపోగా తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకొని తననీ చెల్లెల్నీ పెంచి ఇంత వాళ్లని చేసారు. ఇరవై ఏళ్ల అనుబంధాన్ని త్రోసిరాజని మానస కోసం వెళ్లిపొమ్మంటున్నది మనసు..మరో పక్క తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కష్టపెట్టి నువ్వు బావుకునేదేమిటని ప్రశ్నిస్తోంది వివేకం.

ఎటూ తేల్చుకోలేక నిస్సత్తుగా నుంచున్న చోటనే చతికిలపడిపోయాడు రహ్మాన్.

ఆ రాత్రి అంతా బాగా ఆలోచించిన మీదట..ఏమైనా మానసని పెళ్లి చేసుకొని తీరతాను. మానస లేకుండా బ్రతకడం నా వల్లకాదు. అమ్మానాన్నలు ఈరోజు కాదన్నా రేపు క్షమించి ఆదరిస్తారు. చూస్తూ చూస్తూ కన్న మమకారాన్ని, రక్తపాశాన్ని తెంచుకుంటారా వీళ్లు? అనుకున్నాడు రహ్మాన్ మనసు కుదుట పరచుకుంటూ..ఆ మాటే మర్నాడు వచ్చి జయరాంకి మానసకి చెప్పాడు.

''సారీ మై బోయ్. నా అభిప్రాయం ఏమిటో నిన్నే స్పష్టంగా చెప్పాను. అందులో మార్పేమీ

## గత వైభవం

**పుష్కరకాలం క్రితం ప్రొడ్యూసర్ తుతూ శర్మని వివాహమాడిన పద్మినీ కొల్హాపురి ఇప్పుడు మళ్ళీ తన సత్తాని చాటుకోవాలనుకుంటోంది. కరణ్ రజ్‌డాన్ రచనని ఎయిట్ పేరుతో ఓ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'చిన్న బ్యానర్ చిత్రమైనా ఇందులో నటించడం నాకు ఓ ఎక్స్‌పీరియెన్స్. అందుకే ఒప్పుకున్నాను' అని చెబుతున్న పద్మినీ అందంలో చాలామార్పు వచ్చినట్టు కన్పిస్తోంది. అన్నట్టు ఈ చిత్రంలో గుల్షన్‌గ్రోవర్, రాణీరాజ్‌కుమార్‌లు నటిస్తున్నారు. చాలాకాలం తర్వాత జనం ముందుకి వస్తున్న పద్మినీ స్టార్ ఎలా ఉంటుందో చూడాలి మరి!**



లేదు. పెళ్లికి ఇప్పుడప్పుడే తొందరేమీ లేదు. మీ వాళ్లను ఒప్పించిరా. సాదరంగా నా కూతుర్ని నీ వెంట పెళ్లి చేసి పంపుతాను'' అన్నాడు జయరాం.

''సార్, అది సాధ్యం కాదని చెప్తున్నాను కదా'' అని అంటున్న రహ్మాన్ మాటలను మధ్యలోనే తుంచేస్తూ.

''నాన్నగారూ..నేను రహ్మాన్‌తో పది నిముషాలు మాట్లాడాలి..ప్లీజ్ మీరా రూమ్‌లోకి వెళ్తారా కాసేపు?'' అంది మానస.

''వైనాట్..యూకెన్ ప్రొసీడ్!'' అంటూ లేచాడు జయరాం అక్కడి నుండి.

తండ్రి వెళ్లాక''రహ్మాన్..నేనొక ప్రశ్న అడుగుతాను. సూటిగా సమాధానం చెప్తావా? నువ్వు ప్రేమించేది నన్నా నా శరీరాన్నా?'' అంది మానస సూటిగా చూస్తూ.

''అదేం ప్రశ్న అర్థం లేకుండా. టోటల్‌గా నువ్వు నాకు కావాలి!'' అన్నాడు రహ్మాన్.

''నాకు తెలుసు, నువ్విలాగే అంటావని. కానీ మన పరిచయమైన కొత్తలో నువ్వు అన్నావు గుర్తుందా? జీవితమంతా నాతోనే ఉండాలని ఉందని. దానికి పెళ్లే కావాలా రహ్మాన్? జీవితాంతం మనం మంచి మిత్రులుగా కలిసే ఉందాం! పెళ్లికి అడ్డం వచ్చినట్లుగా..కులమతాలు స్నేహానికి అడ్డు రావుకదా! నీది వాంఛా రహితమైన ప్రేమయితే దాన్ని స్నేహంగా మలచుకో రహ్మాన్!'' అంది మానస.

''అంటే ప్లేటోనిక్ లవ్వా..అది నా వల్లకాదు! ఐ వాంట్ యూ..ఐ నీడ్ యూ..అసలు పెద్ద ఆదర్శమూర్తిలా ఫోజులు కొట్టే మీ నాన్నే ఒక పెద్ద శాడిస్టు. తాను ప్రేమించి పెళ్లి చేసుకొని మనల్ని ఇలా విడదీయడం ఏమైనా బాగుందా?'' అన్నాడు రహ్మాన్ కోపంగా.

''చాలా పొరపడ్డావు రహ్మాన్..ఆయన ఎంతో ఆలోచించిన మీదటే ఇలా చెప్పారు. మీ వాళ్లు నన్ను చేసుకుంటాననగానే నిన్ను ఇంట్లోంచి పొమ్మన్నారు. దాంతో నీ చదువు ఆగిపోతుంది. లేకపోతే నిన్ను మా నాన్నగారు చదివించాలి. మనిద్దర్నీ చదివిస్తూ మా చెల్లాయికి మంచి భవిష్యత్తు నివ్వడం..మనందర్నీ పోషించడం ఆయన సాధ్యమయ్యే పనేనా?

మా అమ్మ వైద్యం కోసం చేసిన అప్పులు..చనిపోయి ఇన్ని సంవత్సరాలయినా నిన్నా మొన్నటి వరకూ తీరుస్తూనే ఉన్నారు. కనుక మనకు ఎటువంటి ఆర్థిక అండదండలూ ఇవ్వలేరు. మా వెనుక బలం బలగం లేదు మనకి కష్టసుఖాల్లో ఆసరా ఇచ్చేందుకు.

మా అమ్మగారు చనిపోయాక ఎంతో కష్టపడి తల్లీ తండ్రీ తానే అయి పెంచారు. తన సుఖం చూసుకోకుండా మా కోసమే బ్రతికారు. అలాంటి వ్యక్తికి ఈ చివరి రోజులలో అయినా ప్రశాంతమైన జీవితాన్ని ఇవ్వడం బిడ్డలుగా మా బాధ్యత కాదా?

ఇరవై ఏళ్లపాటు మనని పెంచి..మన భవిష్యత్తుకు బాటలు వేసిన అమ్మా నాన్నలను 'ఆఫ్టాల్'గా తలచి వదిలేసి మన స్వార్థం మనం చూసుకోవడం న్యాయమేనా?

అసలు మన కాళ్ల మీద మనం నిలబడలేక తల్లిదండ్రుల కష్టంతో బ్రతుకుతూ..

ప్రిమెచ్యూర్‌గా ఆలోచిస్తూ..

ఇంటర్ లెవెల్లోనే ప్రేమించి పెళ్లి చేసుకొని సంసారం పెట్టి బిడ్డలను కనేందుకు ఇది సినిమా కాదు. జీవితం!

ఇవ్వాళ ఎంతో ఆకర్షణగా ఇష్టంగా అనిపించిన మన ముఖాలు..రేపు కష్టాలు ఎదురయినప్పుడు వాటిని ఎదుర్కోలేక ఒకరికొకరం శత్రువుల్లా మారిపోయి ఒకరి మొహాలు ఒకరు చూడ్డానికి ఇష్టపడకపోవచ్చు.

అలా అని నేను డబ్బుకోసం ఆలోచిస్తున్నాననుకోకు. జీవితంలో పెళ్లి ఎలా అయితే ఇటీజ్ ఏ పార్ట్ ఆఫ్ లైఫ్ అవుతుందో డబ్బు కూడా అంతే. అంత కంటే నా దృష్టిలో ప్రాధాన్యత లేదు.

ప్రేమ ఇద్దరి వ్యక్తులకు మాత్రమే సంబంధించినదయితే పెళ్లి సాంఘికమైనది.

సంఘానికి సంబంధించినది.

అందుకే ఏ వ్యక్తీ సంఘం నుండీ విడివడి ఒక్కరిగా బ్రతకలేడు.

నా తల్లిదండ్రులలా విడివడి అనేక కష్టాలు చవిచూసిన సంగతి నాకు బాగా తెలుసు. జీవితంలోకి అడుగిడితే ఆ తొలి అడుగులే..కష్టాల ఊబిలోకి ఎందుకు వెయ్యాలి మనం? ఎంత కాదనుకున్నా ఈ కులమతాలు మన దేశంలో వేళ్లూనుకుని మనుష్యుల మధ్య అడ్డుగోడలు కడుతూనే ఉన్నాయి.

అది ఏ ఒక్కరి వలనో ఛేదించబడడం సాధ్యం కాదు.

మన తరంలో కాకపోయినా ఆ పై తరంలోనైనా ఇవన్నీ సమసిపోతాయని ఆశిద్దాం. రహ్మాన్ ప్లీజ్ అండర్‌స్టాండ్ మీ. మనం మంచి స్నేహితులుగా మిగిలిపోదాం.

ఒక స్నేహితుడుగా నువ్వెప్పుడైనా మా ఇంటికి రావచ్చు.

నేనూ మా నాన్నగారూ..మా చెల్లీ నిన్ను నిండు మనసుతో ఆహ్వానిస్తాం!'' అంది మానస నచ్చజెప్తున్నట్లుగా.

మానస చెప్తున్నదంతా విన్న రహ్మాన్ కళ్ల వెంట నీళ్లు కారుతూండగా అర్థం చేసుకున్నట్లుగా తల పంకిస్తూ ''ఓకే మానసా..నువ్వు చెప్పింది కాదనలేకపోతున్నాను. కానీ నిన్ను మరిచిపోవడం సాధ్యం కాదేమో..ప్రయత్నిస్తాను'' అన్నాడు రహ్మాన్.

''బాధపడకు రహ్మాన్..నిన్న గాక మొన్న మనం పరిచయం అయింది.

దీనికోసం ఇరవై ఏళ్ల అనుబంధాన్ని తెంచుకోవాలనుకోవడం న్యాయమేనా? కన్నవాళ్లను బాధపెట్టి మనం పొందే ఆనందం ఏముంది.

జీవితాంతం మంచి స్నేహితులుగా మిగిలిపోదాం మనం.

మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసుకొని వాళ్లని ఆనందపరుచు.

ఇదే నేను చెప్పగలిగేది..నేనూ పెళ్లి చేసుకుంటాను. ఇలాగే ఉండిపోను. మరోసారి చెప్తున్నాను రహ్మాన్ ప్రేమనేది ఓ మధుర భావన.

అది మనసుకు సంబంధించిందే కానీ శరీరానికి కాదు. బాగా ఆలోచించి చూడు. నీకే అర్థమవుతుంది. బెస్టాఫ్ లక్!'' అంటూ చెయ్యి చాచింది మానస.

''సరే మానసా, వెళ్ళొస్తాను!'' అంటూ కరచాలనం చేసి వెనుదిరిగాడు రహ్మాన్..వచ్చినప్పుడున్న భావావేశం, బాధ ఇప్పుడు మచ్చుకైనా లేవు అతనిలో.

లోపలినుండి కూతురు రహ్మాన్‌తో చెప్తున్నదంతా వింటున్న జయరాం...తన చిన్నారి పొన్నారి చిట్టితల్లి ఇంతలో ఎంత ఎదిగిపోయింది? ఎంత చక్కగా జీవితాన్ని విశ్లేషించింది? సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న నా కూతురి జీవితం ఇక మీద ఏ ఒడిదుడుకులూ లేకుండా సుఖంగా సాగిపోతుంది అనుకున్నాడు.

వడివడిగా వచ్చి కూతుర్ని హృదయానికి హత్తుకుంటూ ''ఎంత ఎదిగిపోయావమ్మా!'' అన్నాడు తృప్తిగా.

''ఇదంతా మీరు నేర్పిందే కదా నాన్నగారూ!'' అంది మానస మబ్బులు తొలగిన చందమామలా ప్రశాంతంగా నవ్వుతూ.

☆

